క్లుప్తంగా

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నల్లగంగమ్మ తల్లి


అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ

సంబేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా దేవరరాయి నల్లగంగమ్మ తల్లి విరాజిల్లుతోంది. ఆదివారం సంబేపల్లెలోని నల్లగంగమ్మ తల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త, ధర్మకర్తలి చైర్మన్ మునగా మురళీ స్వామి, ఈఓ కొండారెడ్డిలు భక్తులకు వసతి సౌకర్యాలు కల్పనపై ఆరా తీశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


అన్నదానం చేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : మండలంలోని ఆడపూరు దిగువ హరిజనవాడలో జెడ్పీటీసీ గడికోట ఉషారాణి, వెంకటసుబ్బారెడ్డి దంపతులు పది లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని గడికోట ఉషారాణి, వెంకటసుబ్బారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నరసారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామచంద్రారెడ్డి, యానాదిరెడ్డి, రమణ, నరసింహులు, రమణయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం


ప్రత్యేక అలంకారంలో అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. క్యూలైన్లు ద్వారా అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పించజేసి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మార్చి 11, 12న జరగబోవు గంగమ్మ జాతరకు ఇప్పటి నుండి ఎక్కడికక్కడ ఏర్పాట్లను చేస్తున్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల భక్తులు, ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి వచ్చారు. లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

బి.కొత్తకోట : కళాశాలకు వెళ్లి అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యమైందని సీఐ సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. మండలంలోని కంబాలపల్లెకు చెందిన విద్యార్థిని అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

ఘనంగా షావలీ బాబా దర్గా ఉరుసు


అలంకరణలో సయ్యద్‌షావల్లి దర్గా

మదనపల్లె సిటీ : మండలం సీటీఎంలోని సయ్యద్‌నాదషావలీబాబా ఉరుసు ఘనంగా ఘనంగా జరిగింది. శనివారం రాత్రి కుల,మతాలకు అతీతంగా గ్రామ పెద్దలు, మత పెద్దలు గంధోత్సవాని నిర్వహించారు. బాబా మజ్జార్‌పై పూలచాదర్‌లతో, విద్యుత్‌దీపాలతో అలంకరణ చేశారు. పురవీధుల్లో ఫకీర్లతో గుర్రపుబండ్లపై ఊరేగింపుగా గంధాన్ని తీసుకెళ్లారు. వేకువజామున మత పెద్ద బాబాజాన్ దర్గాలో బాబాకు గంధాన్ని అంకితమిచ్చారు. బాబా మజ్జార్ వద్ద కుల,మతాలకు అతీతంగా ప్రజలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

‘సిద్ధం’ సభకు సమరోత్సాహంతో..

- జిల్లాలోని అన్ని మండలాల నుంచి తరలిన శ్రేణులు
- ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు


రాయచోటి: సభకు తరలి వెళ్తున్న ప్రజలతో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : సార్వత్రిక ఎన్నికలకు సమర శంఖారావం పూరిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహిస్తున్న సిద్ధం సభకు రాయచోటి నుంచి ప్రజలు అనంతపురం వైపు అభిమానం ఉరకలెత్తి తరలివెళ్లారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి వెల్లువలా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, శ్రేణులు భారీ సంఖ్యలో బయలు దేరారు. సభకు వెళ్తున్న వారు ఎటువంటి ఇబ్బందులు పడకుండా టిఫిన్, భోజనాలు ఏర్పాటు చేశారు. గాలివీడు మండలం తూముకుంట క్రాస్ నుంచి వాహనాలు ర్యాలీగా రాప్తాడుకు బయలుదేరాయి.

చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది..

రాప్తాడులో నిర్వహిస్తున్న సిద్ధం సభ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయలసీమ నలుమూలల నుంచి సభకు ఎన్నడూ లేని విధంగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తుండటంతో వాహనాలు సైతం దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. తండోపతండాలుగా వస్తున్న జనం సుమారు పది లక్షల మందితో సభ జరుగుతుందని అంచనా వేశామన్నారు. అంతకు మించిపోయేలా సభ పరిస్థితి ఉందని అభిప్రాయపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి ప్రజల వద్దకు చేర్చిన నాయకుడిగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని జగన్‌మోహన్ రెడ్డి దక్కించుకున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రసంగం వినాలనే ఉత్సాహంతో ప్రజలు బయలుదేరి వస్తున్నారని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

పుల్లంపేట నుంచి..

పుల్లంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు మండలంలో రైల్వేకోడూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొల్లం గంగిరెడ్డి మాట్లాడుతూ 2024లో ప్రజలందరూ జగనన్నను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ అభివృద్ధి పథకాలు అందాలంటే మరలా జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు.

ఓబులవారిపల్లె నుంచి వందలాదిగా..

ఓబులవారిపల్లె : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కొర్లకుంట జాతీయ రహదారిపై సాయికిషోర్ రెడ్డి జెండా ఊపి వాహనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకునేందుకు తామంతా సిద్ధమేనన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అని, తాను మంచి చేసి ఉంటేనే ఓటు వేయాలని అడిగే సత్తా భారతదేశంలో ఏ నాయకుడుకు లేదని, ఒక జగన్ మోహన్ రెడ్డికే ఉందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సుంకేసుల రఫీ, సర్పంచ్ లౌడి గంగురాజు, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, వైఎస్సార్‌సీపీ నాయకులు మారే సుధాకర్, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, మధు, దేశయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం నుంచి సిద్ధం సభకు..

సిద్దవటం : రాప్తాడులో ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు సిద్దవటం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాప్తాడులో జరిగే సిద్ధం సభకు సిద్దవటం మండలం నుంచి 21 వాహనాల్లో 600 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానంతో స్వచ్ఛందంగానే తరలి వెళ్లారని ఆయన అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ గోపాలస్వామి, పల్లె సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో సభకు తరలి వెళ్లారు.


పుల్లంపేట: బస్సుల్లో సభకు తరలివెళ్తున్న నాయకులు



సిద్దవటం: సభకు తరలివెళుతున్న నాయకులు, కార్యకర్తలు


ఓబులవారిపల్లె: తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం


లక్కిరెడ్డిపల్లె: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు

లక్కిరెడ్డిపల్లె : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం రాప్తాడులో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం సభకు లక్కిరెడ్డిపల్లె నుంచి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యల ఆధ్వర్యంలో పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున సొంత వాహనాలు సమకూర్చుకొని జగనన్న రాప్తాడు సిద్ధం సభకు బయలుదేరారు. జై జగన్, జై శ్రీకాంత్ రెడ్డి అంటూ నినాదాలతో దారి పొడవునా హోరెత్తించారు. రాప్తాడు సిద్ధం సభ జగన్నామస్మరణతో హోరెత్తడంతో కార్యకర్తలలో నూతనోత్సవం నెలకొంది. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే సాధారణ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

చిట్టిప్రేమ పాటకు టీఎస్ఎఫ్ఏ అవార్డు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం ఎంజేఆర్ కళాశాలలో చదువుతున్న రామ్‌చరణ్, చాణిక్య చిత్రీకరించిన చిట్టిప్రేమ పాటకు టీఎస్ఎఫ్ఏ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో మాదాపూర్‌లోని టి–హబ్‌లో జరిగిన కలారజ మీడియా వారి టీఎస్ఎఫ్ఏ (తెలుగు షార్ట్ ఫిల్మ్ అవార్డ్స్)లో అవార్డు అందజేశారు. సందర్భగా రామ్‌చరణ్ మాట్లాడుతూ తాము చిత్రీకరించిన చిట్టిప్రేమ పాట యూట్యూబ్‌లో 16 వేల మందికి పైగా వీక్షించారని తెలిపారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యే లక్ష్యం


అధికారులు, పాఠశాల సిబ్బందితో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ధనుంజయరెడ్డి

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తల్లెంవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని, రాష్ట్రంలో నాడు – నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చి ఇంగ్లిష్ మీడియంలో కార్పొరేట్ స్థాయి విద్యను విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. తల్లెంవారిపల్లి గ్రామంలో దాదాపు రూ. 3 కోట్లతో నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, నూతన భవనాలను నిర్మాణం ప్రారంభ దశకు చేరిందన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు, ఎల్ఈడీ టీవీలను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి పాఠశాలకు ప్రయోజనం కలిగే విధంగా ప్రహరీ గోడ, తదితర అంశాలపై అధికారులకు సూచనలు, సలహాలను ఇచ్చారు. పాఠశాల వెనుకభాగంలో నిర్మిస్తున్న రక్షణ గోడను పరిశీలించారు. సమీపంలో దాదాపు రూ. 2 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులను పరిశీలించి పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగినేని రమేష్ నాయుడు, చిన్నిరెడ్డి అశోక్ రెడ్డి, కె.ఉమాశంకర్ రెడ్డి, ఎంపీటీసీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి


నూతన కార్యవర్గ సభ్యులతో ఆపస్ నాయకులు

రాయచోటి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతన పీఆర్‌సీపై 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షులు నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఆపస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే రాయచోటి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూనతం సంఘంలో అధ్యక్షులుగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా గడికోట బాలాజి, గౌరవాధ్యక్షులుగా రమేష్ కుమార్, కోశాధికారిగా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, వై.అంబికేశ్వరి, కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, రాజ్యలక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్ శైలజ, జిల్లా ఉపాధ్యక్షులు నరేంద్ర, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సురేష్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్వాసపై ధ్యాసతో ఆత్మచైతన్యం


కరపత్రాలను విడుదల చేస్తున్న స్పిరుచువల్ సొసైటీ సభ్యులు

రాయచోటి టౌన్ : ఆత్మచైతన్యం కోసం శ్వాసపై ధ్యాస పెట్టాలని రాయచోటి పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ అధ్యక్షులు దేవకి సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మార్చి 2 వరకు ఏడు రోజులు సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మిక ధ్యాన సప్తాహ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాయచోటి నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలకు చెందిన కుల, మత, లింగ భేదాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ప్రతి రోజు సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు నిర్వహించబడునని పేర్కొన్నారు. అనంతరం కో – ఆర్డినేటర్ డాక్టర్ బయారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అత్మపరిశీలన చేసుకొని మాంసాహారాన్ని తినడం మానివేసి శాకాహారం వైపు నడవాలని సూచించారు. మనం – మన ఆరోగ్యం అనే అంశాలపై గురువులు వచ్చి బోధిస్తారని చెప్పారు. 25 ధ్యాన రత్న అబ్దుల్ రహీం, 26న మేడసాని మోహన్, 27న హిమాలయ యోగి శ్రీ వేదానంద, 28న ధ్యాన గాన తుంబర పిప్పళ్ల ప్రసాద్ రావు, 29న గీతాయాదవ్, 01న భీమనేని వంశీకిరణ్ (సద్గురు స్పిరుచువల్ సొసైటీ వ్యవస్థాపకులు), 02న ప్రకృతి ఉమామహేష్‌లు ఆధ్యాత్మిక బోధనతోపాటు ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన ఆహార నియమాలు వాటి వలన లభించే లాభాలను బోధిస్తారన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉచితంగా భోజన వసతి కల్పించినట్లు సొసైటీ కార్యదర్శి జంగమయ్య తెలిపారు. ట్రెజరర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, ప్రసాద్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5, 6.30 గంటలకు మల్లయ్యకొండుకు బస్సులు వెళ్తాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు నడుస్తాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

వైభవంగా చక్రస్నానం

తంబళ్లపల్లె: కోసువారిపల్లెలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో 10 రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌లు స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వేద పండితులు చక్రస్నానం నిర్వహించారు.

డీఎస్సీ మెటీరియల్ అందజేత

కలికిరి : స్థానిక గ్రంథాలయంలో అధికారి విజయ్ కుమార్ ఆదివారం మండల పరిధిలోని డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌ను అందజేశారు. చిత్తూరు పట్టణానికి చెందిన కుట్టి డీఎస్సీ కేంద్రం వారు నిరుద్యోగ అభ్యర్థుల సౌకర్యం నిమిత్తం మెటీరియల్ వితరణ చేశారని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

24 నుంచి కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు


కాశిరెడ్డి నాయన మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శివునిపల్లె గ్రామానికి ఎదురుగా వెలసిన కాశిరెడ్డి నాయన 22వ ఆరాధనోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి జరుగనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈనెల 24న స్వామికి పూజలతోపాటు అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణం జరిపిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 25న ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, అర్చనలు వంటి పూజా కార్యాక్రమాలను చేస్తామన్నారు. అనంతరం చెక్కభజన, కోలాటం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరుగుతాయన్నారు. అలానే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలిగిన వారు తమ ఎద్లతో బండలాగుడు పోటీల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ వారు తెలియజేశారు.

మార్జిన్ దాటితే జరిమానా

బి.కొత్తకోట: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన చర్యలను ఉల్లంఘించే వారిపై జరిమానా విధిస్తామని సీఐ ఎస్.సూర్యనారాయణ ఆదివారం మీడియాకు తెలిపారు. పట్టణంలో సర్కిల్ ప్రాంతమైన జ్యోతిచౌక్‌లో రోడ్డుకు ఇరువైపులా వేసిన మార్జిన్ లోపలే బైక్‌లను నిలిపి ఉంచాలన్నారు. గీత దాటి పెట్టిన బైక్‌లపై జరిమానా విధిస్తామని తెలిపారు. బీరంగిరోడ్డులో కూడా ఇదే విధంగా నిబంధన పాటించాలని కోరారు. దుకాణాల యజమానులు బైక్‌లను నిలిపేవారికి ఈ నిబంధన వివరించాలని కోరారు. రోడ్లపై తోపుడుబండ్లను నిలిపి ఉంచరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా పోలీసులను నియమిస్తున్నట్లు తెలిపారు.

జల్‌జీవన్ మిషన్‌ద్వారా ప్రతిఇంటికి నీరు

కలకడ : ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి మంచినీటిని అందించనున్నట్లు నడిమిచెర్ల సర్పంచ్ నల్లమ్మ నరసింహారెడ్డి తెలిపారు. నడిమిచెర్ల గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత మినరల్‌వాటర్‌ను అందజేయడంతో పాటు రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉన్న నీటిని ప్రతి ఇంటికి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మంచినీరు చోరీకి అవకాశం లేకుండా ప్రతి వీధికి ఇనుప పైప్‌లైన్ ఏర్పాటు చేసి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు మంచినీటి కోసం వేచి చూడటం, దూరప్రాంతాల నుంచి తీసుకురావాల్సిన అవసరం ఉండదన్నారు.

వినతిని మన్నించండి.. బస్సును నడిపించండి

వీరబల్లె (రాయచోటి టౌన్) : తమ ఊరికి ఆర్టీసీ బస్సులు నడపాలని గడికోట గ్రామ ప్రజలు అభ్యర్థించారు. మండల పరిధిలోని గడికోటకు ఒక ప్రత్యేకత ఉంది. గడికోట వెల్పుల మిట్టకు బస్సు వెళ్లాలంటే మాండవ్య నదిని దాటుకొని వెళ్లాల్సిందే. వర్షాకాలంలో వాహనాల రాకపోకలు లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటారు. దీనిపై అధికారులకు, నాయకులకు గ్రామస్తులు అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించారు. ఎవరూ పట్టించుకోలేదు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై విచారించి గత నెలలో రూ. 6 కోట్లు నిధులు కేటాయించి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభించిన రోజు నుంచి గడికోట, వేల్పుల మిట్ట, రాచపల్లెతోపాటు ఇతర గ్రామాలకు ఆర్టీసీ బస్సు రావడం లేదు. బస్సు రాకపోవడంతో ఆ ప్రాంత నుంచి వీరబల్లె, రాయచోటికి రావాలన్నా, చాలా దూరం నడిచి రావాల్సి వస్తోందన్నారు. అలాగే విద్యార్థులకు పాఠశాలకు, కళాశాలలకు వెళ్లడానికి కూడా నాలుగైదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తమ సమస్యపై స్పందించి తమ గ్రామానికి బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ


విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న దాతలు

సిద్దవటం : సంక్షేమ వసతి గృహాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పోతురాజు చారిటబుల్ ట్రస్టు వారు ఆదివారం పరీక్ష కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు, పోతురాజు నారాయణమ్మ రెండవ వర్ధంతిని పురస్కరించుకొని సిద్దవటంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు పుట్టపర్తి జిల్లా బుక్కపట్నం తహసీల్దారు భారతి, సుభాష్‌బాబు, పురుషోత్తం లోకేష్, నరసింహబాబు, సిరి, వెంకటేశ్వర ప్రసాద్‌లు మాట్లాడుతూ దళిత బహుజన విద్యార్థులు దాతలు అందించిన సహకారంతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పోతురాజు కుటుంబ సభ్యులతోపాటు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.